www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 30 జులై 2023



1 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో ఆగస్టు 1 నుంచి యోగా కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యోగా శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, షుగర్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, 9 నుంచి 10.30 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 701328986 నంబర్లు సంప్రదించాలని తెలిపారు.

మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం తగదు

హింసపై మహిళల పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దేశంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, మాన భంగాలు, హత్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో నిర్లక్ష్యమే కారణమని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతా శనివారం పుట్టపర్తి జిల్లా కదిరి నుంచి అన్నమయ్య జిల్లాకు చేరుకుంది. గాలివీడు, రాయచోటి, చిన్నమండెం, కురబలకోట మీదుగా మదనపల్లె వరకూ సాగింది. రాయచోటి కెజిబివిఎస్ మోడల్ స్కూల్, బస్టాండ్ సర్కిల్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజలు జాతాను ప్రారంభించారు. మొదట మహిళల మీద జరుగుతున్న ఆక్ర త్యాలు ఉట్టిపడేలా ప్రజానాట్య మండలి బృందం ప్రదర్శించబడిన ఆట, పాట నృత్యాలు ప్రజానీకాన్ని ఆకట్టుకుంటూ ఆలోజింపచేశాయి. జాతా ప్రధాన వక్త ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ దేశ ప్రతిష్ట పెంచిన మహిళా రెజ్లర్లు గోల్డ్ మెడల్ తెచ్చే వారిపై లైంగిక వేధింపులు, మణిపూర్‌లో హింసాకాండ, యూనివర్సిటీలో లైంగిక వేధింపులకు ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థినులు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ చిన్నారులపై మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరి గించి అత్యాచారం చేసి హత్యలు చేస్తున్నప్పటికి ప్రదాని మోడీకి చలనం లేదన్నారు. చివరకు సుప్రీం కోర్టు స్పందించే వరకు కేసులు నమోదు చేయలేదన్నారు. కేసులు అయితే నమోదు చేసి ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రోజుకు వందల సంఖ్యలో మహిళలు అదృశ్యమైన కేసులు వెలుగు చూస్తున్నా దిశ, నిర్భయ లాంటి చట్టాలు పేరుకేనని అమలులో నిర్లక్ష్యం ప్రభుత్వాలు వీడాలని సూచించారు. రిజర్వేషన్ల అమలులలో జాప్యం వీడాలన్నారు. 3200 మంది మహిళలు అదృశ్యమైతే ప్రభుత్వాలు నోరు మెదపలేదని పేర్కొన్నారు. 190 మంది అత్యాకారాలకు గుర య్యారన్నారు. మహిళలు ఐక్యంగా సమస్యల పట్ల ఉద్యమిం చాలన్నారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహిళలు హింసకు, దాడులకు గురి అవుతున్నారని వీటిని సంపూర్ణంగా నిషేధించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సమయంలో జగన్ మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే వెంటనే దశలవారీగా మద్యం నిషేధిస్తామని చెప్పి నిషేధ చట్టాన్ని తీసుకురాక పోగా మత్తు పదార్థాలను విచ్చలవిడిగా దొరికే విధంగా చేశారని విమర్శించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బిజెపి ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను, ఖనిజాలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. అందుకోసమే ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్ భూములపై అదానీ, అంబానీల పెత్తనం చెలాయించే విధంగా చేశారన్నారు. ఆగస్టు ఎనిమిదిన మహిళల సమస్యలపై విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షులు దిల్షాద్, రాష్ట్ర నాయకులు రామంజులమ్మ, ఐద్వా అన్నమయ్య జిల్లా కన్వీనర్ ఇ.భాగ్యమ్మ, బంగారుపాప, ఖాజాబి, రెడ్డెమ్మ, నిర్మల, మాధవి, కరుణ, లావణ్య, పద్మజ, ప్రజానాట్య మండలి కార్యదర్శి వెంకటాచలపతి, శ్రీరాములు, పలువురు పాల్గొన్నారు. జాతా మదనపల్లె నుంచి చిత్తూరు జిల్లా కుప్పంకు చేరుకుంది.



మహిళా కళాకారుల నాట్యప్రదర్శన



రాయచోటి బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్ కోరారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం చేతులెత్తేసిందని, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తామే నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకూ ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారం లోకొచ్చిన మూడు సంవత్సరాల్లో ఏర్పాటు చేస్తామని ఓట్లు వేయించుకున్నప్పటికీ దానిని పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పడితే దాదాపు యాభైవేల మందికి ఉపాధి దొరుకుం దని, జిల్లాలో ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని చెప్పారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్ ప్లాంట్ నిర్మించడం తమ వల్ల కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెప్పినప్పటికీ రాష్ట్రంలోని వైసిపి, టిడిపి,జనసేన పార్టీలో ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలపై నోరు మెదపక రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నా యన్నారు. బిజెపికి మద్దతిస్తున్న పార్టీలను ఇంటికి సాగనంపాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి విజయ కుమార్,మున్సిపల్ సంఘ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, గుర్రమ్మ, రాఘవ, సిఐటియు నాయ కులు బాల సుబ్బయ్య, ఓబులేసు, ఆటో యూనియన్ నాయకులు రమేష్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు



డిఇఒతో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ఉత్తర్వులపై వెనక్కి తగ్గిన డిఇఒ

- ఫలించిన ఫ్యాప్టో చర్చలు

- ఆగస్టు 6న తలపెట్టిన ధర్నా విరమణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్నాలు, ర్యాలీలు, నిరసనలో పాల్గొనకూడదని జులై 15న జారీ చేసిన ఉత్తర్వులుపై జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి వెనక్కి తగ్గారు. తాను ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో డిఇఒ శనివారం మధ్యాహ్నం ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించారు. చర్చలలో ఫ్యాప్టో నాయకులు పలు అంశాలను అధికారి దృష్టికి తెచ్చారు. ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు డిఇఒ తెలియజేయడంతో వివాద ముగిసింది. చర్చలలో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయకుమార్ ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో జరిగిన కొన్ని అవకతవకలను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకురాగా వాటిని విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నష్టపోయి ఉంటే వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులను దుర్భాషలాడుతున్న విషయాన్ని ప్రస్తావించగా, విద్యాశాఖను గాడిలో పెట్టాలని ఉద్దేశంతో అక్కడక్కడా కఠినంగా మాట్లాడానే తప్ప, ఉపాధ్యాయులను కించపరచాలనే ఉద్దేశం తనకు లేదని, భవిష్యత్తులో స్నేహపూరిత వాతావరణంలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు. లెసన్ ప్లాన్ విషయంలో కూడా చేతిరాతతో తప్పనిసరిగా రాయాల్సిన అవసరం లేదని, సొంతంగా తయారుచేసిన డిజిటల్ కాపీలను కూడా వాడవచ్చని చెప్పారు. డిఇఒతో చర్చలు సఫలీకృతం కావడంతో ఆగస్టు 6న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విరమించుకున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వై.వెంకట సుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు కె.బాలగంగిరెడ్డి,యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎపిటిఎఫ్(1938) జిల్లా అధ్యక్షులు టి.వెంకటేశ్వరరెడ్డి, ఎపిటిఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు యస్.భాస్కర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ట్రెజరర్ రాజశేఖర్, బిటిఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్.ఆర్.కొండయ్య పాల్గొన్నారు.

త్యాగరాజు కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న త్యాగరాజ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అనేక దపాలుగా ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, నిరసన రూపంలో తెలియజేసినప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలియజేశారు. శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ కాలనీలో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి అధ్వానంగా ఉన్న రోడ్డు దగ్గర నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో సతమ తమవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా రహదారి అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. డ్రెయినేజీలోని మురుగునీరు రోడ్డుపై రావడంతో దుర్వాసనతోపాటు, విషపురుగుల సంచారం అధికమైందని పేర్కొన్నారు. పిల్లలు బయటికి రావాలంటే భయపడుతున్నారని, పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, మున్సిపాలిటీ అధికారులకు తెలియేసినా వారు సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. ఇప్పటికైన సమస్యలు పరిష్కరించి రోడ్డును, డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో డివైఎఫ్ఐ యువజన సంఘంతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గంగనపల్లి నాగార్జున, ట్రెజరర్ పి.సురేంద్ర, ఉపాధ్యక్షులు యు.ఆంజనేయులు, గురవయ స్థానికులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్



కడప : వీరారెడ్డి, మన్విత్ రెడ్డి ఇద్దరూ సెంచరీలు చేయడంతో ఆంధ్ర సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 435 పరుగుల భారీ స్కోరు సాధించింది. 2 వికెట్లను నష్టానికి 256 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు 153.0 ఓవర్లలో 435 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె.హెచ్. వీరారెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిం చాడు. 210 బంతులను ఎదుర్కొని 12 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 123 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ జి. మన్విత్‌రెడ్డి 176 బంతులను ఎదుర్కొని 7 ఫౌండరీలు, 3 సిక్సర్ల సాయంతో 110 పరుగులు చేశాడు. భవానీ ప్రసాద్ 77 పరుగులు చేశాడు. నార్త్ జోన్ జట్టులోని డి.వి. ఎస్. శ్రీరాం బౌలింగ్లో అద్భుతంగా రాణించి 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 30.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఆ చెట్టులోని టీ.వీ. సాయి శ్రవణ్ 96 పరుగులు (నాట్ అవుట్) చేశాడు. సౌత్ జోన్ జట్టు లోని టీ. ప్రదీప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగి సింది. మొదటి ఇన్నింగ్స్ లో సౌత్ జోన్ జట్టు ఆధిక్యత సాధించింది.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, నిత్యావసర, పెట్రోల్, డీజిల్, గ్యాస్, వంటనూనె ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ. 600 వేతనం చెల్లించాలని పట్టణాల్లో కూడా అమలుచేయాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా సాధనకై అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు బీజేపీ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. అంగన్వాడీ, ఆశా, యనిమేటర్లు, కాంట్రాక్టు -ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పేర్కొప్పారు. పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. రానున్న కాలంలో కార్మిక కర్షక సమస్యల కోసం సిఐటియు నిర్వహించే పోరాటాలలో సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసుల రెడ్డి, జిల్లా కార్యదర్శులు కె. శ్రీనివాసులు, కె. నాగేంద్రబాబు, జిల్లా కమిటీ సభ్యులు పులి శ్యాం ప్రవీణ్, సిఐటియు పోరుమామిళ్ల నాయకులు సుందరం, రత్నమయ్య, బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, దియ్యాల హరి, కాలువ శివకుమార్, గంటా శ్రీనివాసులు, సత్య రాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి. సి కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ సిఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 30న జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కేంద్రానికి అధికారికంగా సమాచారం అందింది. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కడప ఆర్అండ్‌బి అతిథి గృహానికి చేరుకుంటారు. మరుసటి రోజు పులివెందుల మున్సిపల్ కార్పొరేషన్ హాలులో నిర్వహించే ఇంటిలెక్చువల్ కార్యక్రమంలో పాల్గొంటారు. మంగళవారం ప్రొద్దుటూరు ఆర్అండ్‌బికి చేరుకుని స్థానికంగా నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొంటారు. బుధవారం ఉదయం 9 గంటలకు కడపలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 2.00 గంటలకు మదనపల్లి చేరుకుంటారు.

స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి : టిడిపి

అట్లూరు : క్రాస్‌రోడ్‌లోని కస్తూరిబా పాఠశాల పక్కనే ఉన్న సుమారు 70 సెంట్ల స్థలాన్ని వైసిపి నాయకులు జెసిబితో చదును చేసి ఆక్రమించుకున్నారని, రెవెన్యూ అధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహించడం సరైకాదని, వెంటనే స్థలాన్ని స్వాధీనం చేసుకోకపోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని మండల తెలుగు యువత అధ్యక్షులు జయ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిందని చెప్పారు. ప్రస్తుతం వైసిపి నాయకులు ఆక్రమించుకోవడం దారుణమని వాపోయారు. 2017-18 సంవత్సరంలో ఉపాధి హామీ చట్టం కింద విలేజ్ పార్కు, మార్కెట్ యార్డు నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించారని తెలిపారు. వెంటనే తహశీల్దార్ శ్రీవాణి స్పందించి ఆక్రమితస్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట యూత్ నాయకులు సుధాకర్‌రెడ్డి, గంగిరెడ్డి, నరసారెడ్డి మస్తానయ్య రిషికేశవ ఉన్నారు.

31న ధర్నాకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం గ్యాస్ ప్లాంట్ వద్ద యూనియన్ కార్యాలయంలో ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సెయిల్ నుంచి తప్పుడు నివేదిక తెప్పించుకుని కడపలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని ప్రకటన చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ఎంపిలు దీనిపై ప్రశ్నించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించడం లాభదాయకం కాదని చెప్పడం బాధకరమని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం ప్రైవేట్ జిందాల్ కంపెనీకి అప్పగించడం ఎలా లాభదాయమవుతుందని ప్రశ్నించారు. 2014 రాష్ట్ర విభజన చట్టంలో, రాష్ట్రపతి ఆమోదంతో పార్లమెంట్‌లో ప్రకటించిన కడప ఉక్కు పరిశ్రమ ఇవ్వకుండా బిజెపి రాయలసీమ కరువు ప్రాంతమైన కడప జిల్లాకు ద్రోహం చేసిందన్నారు. కడప ఉక్కుపై బిజెపి ఢిల్లీలో ఒక మాట, ఎపిలో మరో మాట మాట్లాడుతూ రెండు నాలుకల ధోరణిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ధర్నాలో ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, యువత పెద్ద సంఖ్యలో కదలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, నాజర్, మూర్తి, శ్రీనివాసులురెడ్డి, జి.వి.కృష్ణ, రంగారెడ్డి, మూర్తి, శివ, సాయి భాస్కర్‌రెడ్డి, సంతోష్, ఓబులేసు పాల్గొన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, సభ్యులు డి.ఎం.ఓబులేసు నగరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. **జమ్మలమడుగు రూరల్ :** జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కడప ఉక్కు పై వైఖరిని ఖండిస్తూ సోమవారం సిపిఎం అధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయంతం చేయాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివ నారాయణ పిలుపునిచ్చారు. శనివారం కడప జిల్లా కమిటీ అధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన వెంట నాయకులు దాసు, కృష్ణా రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

'గడప గడపకూ'పై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-అట్లూరు



బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఆధ్వర్యంలో శుక్రవారం కమలకూరు, బిసి కాలనీల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆపణలు చేయడం తగవని వైసిపి మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని పత్రికలు, యూ ట్యూబ్ ఛానళ్లు పనిగట్టుకుని వైసిపిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గడపగడపకు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే ఆరోపణలు చేయడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేకు స్థానికులు తమ సమస్యలు విన్నవిచారని, అందుకు ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభిస్తే కొన్ని పత్రికలు చేదు అనుభవం ఎదురైందని అనడం సరైంది కాదన్నారు. కీ.శే. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి సుమారు రూ.15 కోట్లతో ఆనకట్ట నిర్మించి ఆ గ్రామంలో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఈ విషయాన్ని స్థానికులు ఎన్నటికీ మరిపోలేరన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కాశినాయన

అడవి ప్రాంతంలో ఉండే వన్యప్రాణాలను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని వరికుంట్లలో ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికుంట్ల బీట్ చుట్టుపక్కల నల్లమల్ల అడవుల్లో పులులు సంచరిస్తూ ఉన్నాయని, ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకుండా నల్లమల్ల అడవుల్లోకి ఎవరు వెళ్ళవద్దని చెప్పారు. అడవుల్లో ఉండే ఏ ప్రాణికైనా హాని కల్గిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 1972వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వన్యప్రాణి సంరక్షణ చట్టం తీసుకొచ్చిందన్నారు. వన్యప్రాణాలను కాపాడుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. నాగమ్మ, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు కృష్ణ, రమణయ్య, బీట్ అధికారులు బ్రహ్మయ్య, దస్తగిరి, మల్లికార్జున, కిషోర్, వెంకటేష్ , ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోతుల వెంకట్రామిరెడ్డి

సేవలు కొనసాగిస్తాం

'లయన్స్' నూతన అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సేవలు కొనసాగిస్తామని నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పోతుల వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం పాతబస్టాండ్‌లోని పోతుల ట్రావెల్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ గత ఏడాది లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్యలో చేరామన్నారు. తాను చేసిన సేవా కార్యక్రమాలను చూసి ఈ ఏడాదికి అధ్యక్షులుగా చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. తనపై సభ్యులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. కేవలం వైద్య శిబిరాలే కాకుండా విద్య, ఆరోగ్యం, అనాథలు, అభాగ్యులు, భవన కార్మికులకు చేయూతనిచ్చే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. దశలవారీగా అవసరమైన అన్ని వర్గాలకు సేవ కార్యక్రమాలను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళతామన్నారు. కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు మాట్లాడుతూ రాయలసీమ టూరిజం ద్వారా పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్యలో భాగస్వాములు అవుతున్నామని తెలిపారు. అమ్మాయిలకు క్రీడా సామగ్రిని అందిస్తామని చెప్పారు. అందరూ సహకరించాలని కోరారు. బిసి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ సమాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

ఖాసింఖాన్‌కు సత్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఖాసింఖాన్‌ను సన్మానిస్తున్న జెకె యూత్ నాయకులు

విద్యాసాధన విద్యా సంస్థలు, గుడ్ బర్డ్ ఇంటర్నేషనల్ హైస్కూల్ అధినేత లయన్ పఠాన్ ఖాసింఖాన్ సేవలు అభినందనీయమని జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్ బాష అన్నారు. శనివారం విద్యాదాతను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాష మాట్లాడుతూ అన్న, ధన, విద్యా ధానం చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. రవీంద్రనగర్‌లో ఉన్న యువత విద్య కోసం ప్రతి ఏడాది రూ.20వేలు ఇవ్వడానికి ముందుకు రావడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్షులు కరీముల్లా, జెకె నగర నాయకులు సలీంబాష పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ

ప్రజాశక్తి - కడప అర్బన్

మతసామరస్యానికి ప్రతిక పీర్ల పండుగ అని టిడిపి కడప నియోజకవర్గ ఇంఛార్జి వి. ఎస్. అమీర్‌బాబు అన్నారు. శనివారం నగరం లోని హోమియోకళాశాల దగ్గర ఉన్న ఎస్ఆర్ నగర్‌లో వెలసిన పీర్ల చావిడి మకాన్‌లో మొహర్రం పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి పీర్ల పండుగను నిర్వహిస్తున్న మహబూబ్‌బాషను అభినందించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీర్ల చావిడి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం సోదరులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. **చెన్నూరు :** మండలంలోని కొండపేటలో శనివారం మొహర్రం పండుగను వేడుకగా నిర్వహిం చుకున్నారు. గ్రామచావడిలో ఏర్పాటు చేసిన పీర్లకు పది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, సర్పంచ్ చంద్ర యాదవ్, ఎంపిటిసి నాగిరెడ్డి, నాయకులు, కార్యర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిఒ 1ని ఉపసంహరించుకోవాలి

కడప అర్బన్ : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జిఒ నంబరు 1ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీట్లను వర్గీకరణ కింద విభజించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి మంజూరు చేసిన మొత్తం మెడికల్ సీట్లు 750 అని పేర్కొన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిలింగ్ 112 సీట్లను అన్ని రాష్ట్రాల వారికి ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారని తెలిపారు. మిగిలిన 630 సీట్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒల వల్ల 319 సీట్లు (50శాతం) సాధారణ విభాగానికి కేటాయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధానంపై తీసుకున్న చర్య సరైంది కాదని దీనిపై పునరాలోచన చేయాలని తెలిపారు.

దారుణం

ప్రజాదృష్టి

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి సమీపంలోని ఇటీవల కడప-చెన్నయ్ ప్రదాన రహదారిపై ఆర్‌టిసి బస్సును ట్యాంకరు ఢీకొన్న ఘటన విస్మయాన్ని కలిగించింది. రెండ్రోజుల కిందట డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణలో పురోగతి సాధించామని పేర్కొనడానికి రెండ్రోజుల ముందు దారుణ ప్రమాదం ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అనుసరించిన మార్గాలేమిటో గమనించాలి. వాటిని దేశీయ అవసరాలకు అనుగుణంగా మర్పులు చేర్పులు చేసుకుని అమలు చేయాల్సి ఉంటుంది. ఇదే తరహాలో గల్ఫ్ దేశాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు అమలు చేస్తున్న విధానాల తీరును గమనించాలి. లేకపోతే ఓ సినిమాలో రోడ్డు ప్రమాదాల నివారణ. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నిమిత్తం భారీ జరిమానాల విధించిన తీరును గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి వాహన డ్రైవరును పోలీసు, ఆర్‌టిఒ అధికారులు సంయుక్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌ల సంఖ్యను పెంచాలి. డ్రంక్ అండ్ డ్రైవ్‌ల పేరిట మద్యం తాగిన డ్రైవర్లపై దశలవారీగా జరిమనాల సంఖ్యను పెంచే ఆలోచన చేయాల్సిన అంశాన్ని పరిశీలించాలి. జరిమానాలను లెక్క చేయని డ్రైవర్ల లైసెన్స్ రద్దు అంశాన్ని సీరియస్‌గా పరిశీలించాలి. వీరికి అనుబంధంగా ఆర్అండ్‌బి అధికారులు రహదారుల అభివృద్ధి పనులపై దృష్టి సారించాల్సి ఉంటుంది. పోలీసులు, ఆర్‌టిఒ, అర్అండ్‌బి అధికారులు సంయుక్తంగా సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను అదుపులోనికి తీసుకుని రావచ్చని చెప్పుకోవచ్చు. ఇదిలా ఉండగా ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణపై కసరత్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా వందలాది కుటుంబాలు పోషకులను కోల్పోయి వీధిన పడుతున్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలి. రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు మందుల ఖర్చులను ప్రభుత్వమే భరించాల్సి వస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. పోలీస్, న్యాయం, వైద్య సదుపాయాల నిమిత్తం చేయాల్సిన, చేస్తున్న పద్దులను అండ్ డ్రైవ్ విభాగాలపై వెచ్చిస్తే వేలాది కుటుంబాలను కాపాడుకో వచ్చనడంలో సందేహం లేదని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

'సినారే' పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సాహితీ ప్రపంచంలో తనదైన శైలిలో లక్షలాది శ్రోతలు, పాఠకుల మనస్సు దోచుకున్న సినీగేయ రచయిత, కవి, వక్త, తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలకు శ్రీకారం చుట్టిన కవి డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వారు విస్మరించడం దారుణమని సి.పి.బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధన కేంద్ర భవన నిర్మాణానికి రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. రాజ్యసభ సభ్యునిగా ఉంటూ పలుమార్లు బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించారని పేర్కొన్నారు. జానమద్ది హనుమచ్చాస్త్రి కృషిని కొనియాడారని తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా వైవీయూ విసి, రిజిస్ట్రార్ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నిరాశలో పత్తి రైతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పత్తి పంటపై రైతుల ఆశలు ఈ సారి నిరాశే అని చెప్పవచ్చు. ఇదివరకే పత్తి పంటకు ఎర్రనక్క, తెగులు సోకడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పది రోజులుగా మబ్బులు ఉండటం, చినుకులు రాలడంతో పత్తి కాయలు నేల రాలుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదఫా రైతులు ఎన్నో ఆశలు నింపుకొని పత్తి సాగు చేశారు. పంట కోసం వేలది రూపాయలు వెచ్చించారు. కృష్ణా జలాలు అందుబాటులో ఉన్న కారణంగా నీటి సమస్య తలెత్తలేదు. పైరు మధ్యలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలు రైతులకు కొస్త ఊరట కలిగించాయి. సాగు దాదాపు ఎకరాకు రూ.25 నుంచి రూ.35,000 రైతులు ఖర్చు చేశారు. ఆశకోకుండా వచ్చిన వర్షాలతో పైరు ఏపుగా పెరిగింది. పైరు కళకళలాడుతున్న దశలో తెగులు సోకడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ తెగులు వల్ల ఆకులు ఎర్రగా మారిపోవడం, పక్వానికి వచ్చిన కాయ పగిలిపోవడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేదని రైతులు అంటున్నారు. దిగుబడి వచ్చినా కాడికి విక్రయించుకుని సొమ్ము చేసుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైంది. పత్తి ధర కూడా గణనీయంగా తగ్గినట్లు కొంతమంది రైతులు అంటున్నారు. గతేడాది క్వింటా రూ.11వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7వేలు కంటే ఎక్కువ లేదని రైతులు తెలిపారు. ఆకాశం మబ్బుల వల్లే దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయినట్లు పేర్కొంటున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి చేతికి అందుతుంది. ప్రస్తుత వాతావరణం ప్రతికూలించడంతో 5 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికందే అవకాశాలున్నాయని రైతులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బ తింటున్న పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.


సాగులో పత్తి

నేటి కవులకు సినారె ఆదర్శనీయులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాభిమానులు

తెలుగువారి అభిమానాన్ని దోచుకున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి నేటి కవులు, రచయితలకు ఆదర్శప్రాయుడని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సినీకవి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో నారాయణరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయలు, విశ్వనాథనాయుడు వంటి గేయకావ్యాలు, రాయప్ప వంటి రూపకాలు,కవితా ప్రపంచంలో వీరికెంతో గౌరవ స్థానాన్ని సంపాదించి పెట్టాయన్నారు. ట్రస్టు కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ మలేషియా, సింగపూర్, రష్యా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో సినారె పర్యటించి సాహిత్య ఉపన్యాసాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువులు బాబు, ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్.నాగేశ్వరరావు, వై.చంద్ర శేఖర్‌రెడ్డి, కుండా భాస్కర్, వారధి మధు, రామిరెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - చాపాడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం మునిసిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రతి ఇంటికి వెళుతున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. కాలనీలో వర్షం నీరు నిలుస్తుందని, డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమణ్ నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వెంకట్‌ను మెచ్చిన చిరంజీవి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విభిన్న ప్రతిభావంతుడు ప్రొద్దుటూరుకు చెందిన వెంకట్‌ను మెగాస్టార్ చిరంజీవి మెచ్చుకొని అక్కున చేర్చుకున్నారు. వెంకట్ ప్రతిభను తెలుసుకున్న మెగాస్టార్ హైదరాబాద్ జుబ్లీహిల్స్‌లోని తన స్వగృహానికి ఆహ్వానించినట్లు వెంకట్ తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా వివరించారు. వెంకట్ తన పాటలు, డైలాగులు, లిప్ రీడింగ్‌తో చిరంజీవిని ఆశ్చర్యచకితులను చేశారని తెలిపారు. సమస్యలు చుట్టుముట్టినప్పటికీ ఆత్మస్థైర్యంతో పట్టుదలతో వెంకట్‌ను అసాధారణ ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దిన వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణయ్యను చిరంజీవి అభినందించారు. తన నుంచి ఏమి సాయం కావాలని చిరంజీవి అడుగ్గా, వెంకట్ బయోపిక్ తీసేందుకు స్క్రిప్ట్ సిద్ధం చేశానని కొణిదెల ప్రొడక్షన్స్‌లో సినిమా తీయాలను అభ్యర్థించినట్లు విశాలాక్షి చెప్పగా, భవిష్యత్తులో సహకారం అందిస్తానని చిరంజీవి చెప్పారన్నారు.. చిరంజీవి జన్మదిన వేడుకల్లో తన ప్రదర్శనకు అవకాశం కల్పించమని వెంకట్ అడుగగా తప్పక కల్పిస్తానని చిరంజీవి హామీ ఇచ్చినట్లు విశాలాక్షి తెలిపారు.


వెంకట్‌ను అభినందిస్తున్న చిరంజీవి

భక్తి శ్రద్ధలతో పీర్ల పండుగ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


గ్రామోత్సవంలో పీర్లు

ప్రొద్దుటూరు మట్టి మసీదు వీధి వాసులు శనివారం భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగను జరుపుకున్నారు. పీర్ల చావిడిలో మొహరం పండుగ సందర్భంగా కొలువుదీరిన పీర్లను ఊరెరిగింపు చేశారు. అంతకు ముందు ప్రత్యేక ఫాతెహా చేశారు. దస్సు సాహెబ్ అండ్ సన్స్ వారు, కమటీ సభ్యులు, స్థానికులు సాల్గొన్నారు.

ఘనంగా పీర్ల జల్ది ఉత్సవం

చక్రాయపేట : జిల్లాలో ప్రసిద్ధి చెందిన సురభి రెడ్డివారిపల్లెలో వెలిసిన బాదుల్లా పీర్ల చావిడిలో కులమతాలకు అతీతంగా తొమ్మిది రోజులుగా మొహరం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం బాలతిమ్మయ్యగారి పల్లె సమీపంలో వడ్డేరవంకలో నాలుగు గ్రామాల నుంచి వచ్చిన పీర్లతో జల్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా వాసులే కాకుండా చిత్తూరు, అనంతపురం, బెంగళూరు, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రజలు విచ్చేశారు. జల్ది ఉత్సవానికి బాల తిమ్మయ్యగారిపల్లె, నాగలగట్టుపల్లె, అగ్రహారం గ్రామాల పీర్లు కలుసుకుని చివరిగా సురభి రెడ్డివారిపల్లె పీర్లు ఎదురుగా తాకి జల్ది ఉత్సవం జరిపారు. **భారీ బందోబస్తు :** ఉత్సవాల సందర్భంగా ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. **ముద్దనూరు :** మోహరం పండుగను ముద్దనూరు, డిఎన్ పల్లె, ఉప్పలూరు, కోనాపురం, యామవరం, మంగపట్నం గ్రామాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉప్పలూరులో పలు విచిత్ర వేష ధారణలతో గ్రామస్తులు అలరించారు.


జల్ది అందుకుంటున్న పీర్లు

నిత్యావసర సరుకులు వితరణ

చాపాడు : మైదుకూరు జొసఫ్‌పేట కాలనీలో నివాసం ఉంటున్న విభిన్నప్రతిభావంతురాలు జి.లక్ష్మీదేవి భర్త అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబం గడవడం చాలా ఇబ్బందిగా ఉన్న విషయం తెలుసుకొన్న నేస్తం అభయహస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మూడు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు, కూరగాయలు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అభయ హస్తం అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రమాదేవి, ప్రధాన కార్యదర్శి రఘురామిరెడ్డి, కార్యదర్శి జ్యోతి, కోశాధికారి మారెన్న, కార్యవర్గ సభ్యులు రవిశంకర్, సుబ్బారాయుడు, అమీర్, వెంకటేశ్, స్వర్ణలత, గంగాధర్, సుభాష్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న 'నేస్తం' సభ్యులు

ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు : టిడిపి


మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ వాసి ముఖ్యమంత్రి అయినా కూడా రాయలసీమలో ఒక్క నీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. ఎస్ఆర్‌బిసి కాలువ పనులు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. 2014 నుంచి 2019 వరకు సాగు నీటి ప్రాజెక్టుల మీద టిడిపి ప్రభుత్వం రూ.22,165 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం 2019 నుండి 2023 వరకు కేవలం రూ.2,011కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాజోలి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదన్నారు. టిడిపికి మాత్రమే రాయలసీమ, నీటి ప్రాజెక్టుల మీద చిత్తశుద్ధి ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి రాయలసీమకు చేయనంత ద్రోహం, అన్యాయం జగన్ చేశారన్నారు. రాయలసీమలో సిరులు పండాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, భూసిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్, దస్తగిరి, మల్లారెడ్డి, సుబ్బరాజా, సురేంద్రనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగరాజు, చంద్రమోహన్, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులను తక్షణమే నింపాలి : రెడ్యం సోదరులు

ఖాజీపేట : రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదిలో పుష్కలంగా నీరు ఉన్నందున జిల్లాలోని కెసి కెనాల్ కింద ఉన్న చెరువులను తక్షణం నింపాలని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెండ్యం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆ మేరకు కెసి కెనాల్ ఎస్ఇ రెడ్డి శేఖర్‌రెడ్డికి వివరించారు. మండలంలోని దుంపలగట్టులో రెడ్యం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద శుక్రవారం సాయంత్రం 10,600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, ఆ నీటిని కడప జిల్లాలోని కెసి కెనాల్ కింద చెరువులను నింపాలన్నారు. తక్షణం రాజోలి చేపట్టాలని సిఎంకు శనివారం లేఖ రాసినట్లు తెలిపారు.

అలసత్వమే రాజోలి రిజర్వాయర్‌కు గుదిబండ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అలసత్వమే రాజోలి రిజర్వాయర్‌కు గుదిబండలా మారిందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రాజోలి ఆనకట్ట దగ్గర దాదాపు పదివేల క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైందని, రాజోలి రిజర్వాయర్ నిర్మించి ఉంటే ఒక రోజులోనే నిండేదని తెలిపారు. పాలకుల అలసత్వం వల్ల కడప జిల్లాలో కెసి కెనాల్ కింద ఉన్న 98 వేల ఎకరాల రైతులు, నారుమళ్లు పోసుకునేవారని వివరించారు. నీళ్లన్నీ సోమశిల డ్యామ్‌లోకి వెళుతున్నాయన్నారు. 2019లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి 2022 కల్లా పూర్తి చేస్తామన్నారని తెలిపారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో భూసేకరణ కూడా జరగలేదన్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి 2.98 టిఎంసిగా నిర్మించాలని, కానీ కేవలం ఒక టిఎంసి, అర టిఎంసి అంటూ ఉన్నారని, చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యంతో నిర్మించడానికి రెండేళ్ల కంటే ఎక్కువ సమయం పట్టదని తెలిపారు. అనవసరమైన పథకాలకు మాత్రమే జగన్ ప్రాధాన్యతనిస్తున్నారని, ఇది సరికాదని ప్రతాప్ రెడ్డి విమర్శించారు.

75 శాతం పులులు మన దేశంలోనే..

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రపంచంలోని పులుల్లో 75శాతం మన దేశంలోనే ఉన్నాయని, ఇందులో మన రాష్ట్రంలో 48 పెద్దపులులున్నాయని అటవీ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. ప్రపంచ టైగర్స్ దినోత్సవం సందర్భంగా శనివారం పుల్లారెడ్డిపేటలో ఉన్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అడవిలో శాఖాహార, మాంసాహార జంతువుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జాతీయ జంతువు పెద్దపులి అని తెలిపారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది సురేంద్ర,ఈశ్వరమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ప్రస్తుత తరుణంలో పులులను రక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటి చెబుతూ 2010 నుంచి ప్రతి ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అటవీ అధికారి తెలిపారు. నగరవనంలోని పులిబొమ్మ వద్ద నిలుచొని వాటి గురించి విద్యార్థులకు వివరించారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడుతాయన్నారు. అడవులు బాగుండాలంటే అందులోని జంతుజాలం, జీవన వైవిధ్యం సమతూకంలో కొనసాగాలన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకమని తెలిపారు. నగరవనంలో చైర్మన్, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, డేనియల్ బాబు, ప్రశాంత్, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, రాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్, అటవీ అధికారులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పులుల సంరక్షణపై అవగాహన అవసరమని ఎఫ్ఆర్ఓ హేమాంజలి పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజీవ్ గాంధీ నేషనల్ పార్క్‌లో భాష్యం స్కూల్ విద్యార్థులకు ప్రకృతి సమతుల్యత-పులి మనుగడపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రవిచంద్ర, ఎఫ్‌బిఓలు, ఎబిఓలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు


ఉద్యోగాలు సాధించిన వారితో కళాశాల యాజమాన్యం

ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 'సాధన' విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక దొరసానిపల్లెలోని సాధన గవర్నమెంట్ జాబ్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు డైరెక్టర్ ఉషా వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ఆ మేరకు ఫలితాలు పొందుతున్నామన్నారు. హైదరాబాదులో సంస్థను స్థాపించి సుమారు 8వేల మందికి ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ నిచ్చామన్నారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఈ అకాడమీ స్థాపించినట్లు పేర్కొన్నారు. రెండేళ్లకే ఆరుగురు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. చంద్రకళ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రేమ్‌దీప్ ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులు కూడా శిక్షణ పొందితే డిగ్రీ పూర్తి చేసే లోగానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. చంద్రకళ, ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ సాధన గవర్నమెంట్ జాబ్స్ అకాడమీలో శిక్షణ పొందితే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సులభతరమన్నారు. తమను తీర్చిదిద్దిన అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, ఉషకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో విఫలం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో బిజెపి ఉన్నప్పటికీ ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుటలో ప్రభుత్వాలు విఫలమైనట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వం మణిపూర్ రాష్ట్రంలో ట్రబుల్ ఇంజన్‌గా మారిందని తెలిపారు. 86 రోజులుగా మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ సమస్య దేశ సమైక్యత, దేశ ప్రతిష్టకు సంబంధించిన అంశమన్నారు. కేవలం 28 లక్షల జనాభా ఉన్న మణిపూర్‌లో అమానుషమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన మణిపూర్‌లో శాంతి భద్రతల పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు. మోడీ పాలనలో దేశం అప్పుల భారత్ అయినట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం తాగుబోతులను తాకట్టు పెట్టి ఆర్థిక సంస్కరణల నుండి, బ్యాంకుల నుండి అప్పులు తేవడం విడ్డూరమన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తులసిరెడ్డి తెలిపారు.

ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో దాదాపు 4లక్షల పైచిలుకు ఉన్న ప్రయివేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, జిల్లా సంఘ అధ్యక్షులు గడ్డం రాజు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1994 విద్యాచట్టం మేరకు పిఎఫ్‌ను అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాలను అనుసరించి సరైన జీతం అందించాలన్నారు. 12 నెలల జీతం ఇవ్వాలన్నారు. అకారణంగా ఉద్యోగం నుండి తొలగించకూడదన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు నిబంధనలను, చట్టాలను అమలు చేసేలా యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురావలని కోరారు. లేనిపక్షంలో డిఇఒ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.

నేడు ఎర్రగుంట్లలో ఉచిత వైద్య శిబిరం

ఎర్రగుంట్ల : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి తెలిపారు. గుండె జబ్బులకు సంబంధించి పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని కిమ్స్, సవేరా హాస్పిటల్స్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన

జమ్మలమడుగు రూరల్ : మండలంలో గండికోటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచు కె.గురుఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేద ప్రజలు వైద్య శిబిరానికి చేరుకొని చికిత్స పొందారు. పుష్పగిరి కంటి వైద్యశాల డాక్టర్ సురేష్ బృందం సేవ చేసింది. దాదాపు 10 మందికి కంటి సమస్యలు ఉన్నాయని వారికి ఉచితంగా పుష్పగిరి వైద్యశాలలో వైద్య పరీక్షలు జరిపిస్తామని చెప్పారని సర్పంచు తెలిపారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామానికి రోడ్డు వేస్తేనే ఓట్లేస్తాం

- బస్వాపురం వాసుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


రోడ్డు కావాలంటూ నిరసన తెలుపుతున్న ప్రజలు

తమ గ్రామానికి రోడ్డు వేస్తేనే ఓటు అంటూ మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ బస్వాపురం వాసులు శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామ రోడ్డు కోసం 30ఏళ్లుగా నిరీక్షిస్తున్నామన్నారు. చిన్నపాటి వర్షం పడినా అడుగు వేయలేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను అధికారులు గుర్తించాలని వార్డు సభ్యులు రాజేష్ ఆధ్వర్యంలో ప్ల కార్డులు ధరించి భిక్షాటన చేశారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారుల వద్ద నుండి 'మా గ్రామానికి రోడ్డు కావాలి.. సాయం చేయండి' అంటూ భిక్షాటన చేశారు. 'ఓటు కావాలంటే.. రోడ్డు వేయాలంటూ', 'మాటలు వద్దు.. మార్పు కావాలి' అంటూ నినాదాలు చేశారు. అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు వేయాలని వారు కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.10 కోట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. ఉన్నత విద్య కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్ నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. నూతన భవనాల నిర్మాణానికి దాదాపు రూ.22 కోట్లు మంజూరు చేశారన్నారు. కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటుతో పాటు అప్రోచ్ రోడ్డు కోసం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో ఆడిటోరియం, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి జడ్పీటీసీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సిఎం జగన్ పెద్ద పీట వేస్తున్నట్లు రవికుమార్‌రెడ్డి తెలిపారు.

నేడు చిత్ర కవితా సౌరభం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం అలంకారం వేంకట రమణరాజు రచించిన చిత్రకవితా సౌరభం గ్రంథాన్ని స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించనున్నట్లు కళాభారతి సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత కొమ్మిశెట్టి మోహన్ సభాధ్యక్షుడిగా, అతిథులుగా చదువుల సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, సంస్కృత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ పద్య కవులు ఎసి దస్తగిరి, డాక్టర్ వియమ్ భాస్కరరాజు, టిటిడి ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు డాక్టర్ మూలె రామముని రెడ్డి, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, సాహితీ వేత్తలు జి.వి.సాయిప్రసాద్, అవధానం అమృతవల్లి, అలంకారం విజయకుమార్ హాజరవుతారని తెలిపారు కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు, అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఐకమత్యంతో టిడిపిని గెలిపిస్తాం : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి టిక్కెట్ ప్రొద్దుటూరులో ఎవరికిచ్చినా ఐకమత్యంతో పార్టీని గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి తెలిపారు. రాష్ట్ర టిడిపి నాయకులు సీఎం సురేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో రెండవ మొబైల్ అన్న క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వరద విలేకరులతో మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో రూ.5కే భోజన వసతి కల్పించారని గుర్తు చేశారు. ఏ రాష్ట్రంలోనైనా గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కొత్త ప్రభుత్వాలు కొనసాగిస్తాయన్నారు. ఎపిలో అధికారం చేపట్టిన జగన్ అన్న క్యాంటీన్లను రద్దు చేస్తూ పేదల కడుపు కొట్టారని విమర్శించారు. సీఎం సురేష్ నాయుడు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ అపురూపంగా ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 3న జిల్లాలో చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు గండికోటకు విచ్చేస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షులు బుర్ర రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి